ప్రజాశక్తి

గురువారం 26 జూన్ 2025 | 5 | శ్రీ సత్యసాయి

సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో అవుత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి విస్తతపరిచేందుకు అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువు పట్టు అయినా పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులు ప్రోత్సహించేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. జిల్లాలో కూడా పారిశ్రామిక రంగాన్ని మరింత అభివద్ధి చేసే విధంగా నూతన పరిశ్రమల పాలసీకి అనుగుణంగా జిల్లా ఆర్థిక అభివద్ధికి దోహదపడే విధంగా నిరుద్యోగ యువతకు ఉపాధి, అవుత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందివ్వనున్నట్లు తెలిపారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడిగిడుతున్న వారికి ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించే విధంగా బ్యాంకర్లు సహకరించాలన్నారు. పరిశ్రమలకు సంబంధించి ఏవైనా దరఖాస్తులు పెండింగ్లో ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా కొత్త పరిశ్రమల స్థాపనకు వచ్చిన అనుమతులను కలెక్టర్ సమీక్షించారు. పెట్టుబడి రాయితీ కింద మూడు యూనిట్లకు రూ.46.69 లక్షలు, వడ్డీ రాయితీ కింద మూడు యూనిట్లకు రూ.1.70 లక్షలు మంజూరుకు కమిటీ ఆమోదించింది. 28 పరిశ్రమల అనుమతులకు సంబంధించి అనుమతులు కమిటీ మంజూరు చేయడానికి ఆమోదించింది. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం నాగరాజు, ఎల్డిఎం రమణ రావు, జిల్లా ఫ్యాక్టరీల అధికారి రాధాకృష్ణ, విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్, ఏపీఎస్ఎఫ్సి బ్రాంచ్ మేనేజర్ అన్సారీ, జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి కృష్ణకుమారి, ఏపీఐఐసి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీని తలపించేలా మతోన్మాద పాలన

బహిరంగ సభలో ప్రసంగిస్తున్న పి.మధు

మాట్లాడుతున్న వి.రాంభూపాల్

- ప్రశ్నించే వారిపై దాడులు, అక్రమ కేసులు
- దేశ సమైక్యతను రెచ్చగొడుతూ ప్రజల మధ్య చీలిక
- ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాట స్ఫూర్తితో మతోన్మాద పాలనపై పోరాటానికి సిద్ధం
- సిపిఎం పూర్వ రాష్ట్ర కార్యదర్శి పి.మధు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దేశంలో ఏమర్జెన్సీని తలపించేలా ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో మతోన్మాద పాలన సాగుతోందని సిపిఎం పూర్వ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీ పి.మధు విమర్శించారు. ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తి అయిన నేపథ్యంలో బుధవారం ఉదయం సిపిఎం అనంతపురం నగర కమిటీ ఆధ్వర్యంలో 'ఎమర్జెన్సీ నాడు- నేడు' అన్న అంశంపై ర్యాలీ, సభను నిర్వహించారు. స్థానిక రైల్వే స్టేషన్ నుంచి టవర్క్లాక్ సమీపాన ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం టవర్క్లాక్ వద్ద సభను నిర్వహించారు. సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో మధుతో పాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ 50 సంవత్సరాల క్రితం జూన్ 25న దేశంలో ఎమర్జన్సీ ప్రకటించిందన్నారు. అర్ధరాత్రి దేశంలో ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు 1.13 లక్షల మందిని ప్రభుత్వం అరెస్టు చేసిందన్నారు. ఇందులో కార్మిక యూనియన్ల నాయకులు, విద్యార్థి నాయకులే ఎక్కువగా ఉన్నారన్నారు. 18 లక్షల మంది కార్మికుల మీద తీవ్ర నిర్బంధం సాగిందని తెలియజేశారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్లో ఎమర్జెన్సీలో మార్క్సిస్టుల మీద పగబట్టి వ్యవహరించిందన్నారు. వాస్తవంగా నాడు కార్మికులు, విద్యార్థులు, వామపక్ష వాదులే ప్రధాన ప్రతిఘటనదారులన్నారు. 50 ఏళ్ల అనంతరం ఎమర్జెన్సీ చీకటి పాలన గుర్తు చేసుకుంటే, అంతకంటే మరింత ప్రమాదకరమైన పరిస్థితులు ప్రస్తుతం అమలవుతున్నాయన్నారు. కార్పొరేట్ మతోన్మాద నయా ఫ్యాసిస్ట్ పాలనలో ప్రజలు నిర్బంధాన్ని చవిచూడవల్సి వస్తోందన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా యుఎపిఎ చట్టం కింద ఎలాంటి విచారణ లేకుండా పదేళ్ల జైలు నిర్బంధాన్ని అనుభవించారన్నారు. బ్రిటీష్ కాలం కంటే ఘోరంగా నేటి దేశ పాలకులు ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనూ పోలీసు రాజ్యం నడుస్తోందని విమర్శించారు. అందరిపైనా కేసులు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు.

మత విద్వేషాలు రెచ్చగొడుతూ పాలన

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్

దేశంలోని మోడీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజల మధ్య చీలిక తెచ్చేలా పాలన సాగిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఎవరైనా ప్రశ్నిస్తే బిజెపి పాలనలో పదేళ్ల ఎలాంటి విచారణ లేకుండా నిర్బంధించే పరిస్థితి ఉందన్నారు. 370 అధికరణం రద్దు తర్వాత జమ్ము కాశ్మీర్, లడక్ లాంటి ప్రాంతాల్లో ప్రజాస్వామ్యం మగ్యం అయ్యిందన్నారు. మత విద్వేషాన్ని రెచ్చగొట్టి దేశ సమైక్యత మీద విశ్వాసాన్ని దెబ్బతీసేలా మోడీ పాలన సాగుతోందన్నారు. గోసంరక్షణ పేరుతో ఆర్ఎస్ఎస్ మూకదాడులు పేట్రేగి పోతున్నాయని తెలిపారు. దేశంలో ఇదివరకు ఎన్నడూ లేని స్థాయిలో అస్తిత్వ రాజకీయాల ప్రాతిపదికన పరమత ద్వేషాన్ని రెచ్చగొట్టడం, సాటి పౌరుల్ని పరాయివారుగా పాలకులే చిత్రించడం అత్యంత విచారకరం అన్నారు. ఉగ్రవాద చర్యలను అరికట్టి, శిక్షించే అంశాన్ని వదిలిపెట్టి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పరమత సహనం కోరే వారిని మన దేశం నుంచి పాకిస్తాన్ పంపాలని చెప్పే స్థాయికి పాలన వచ్చిందన్నారు.

కార్పొరేట్ పాలన

సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు

బిజెపి, నరేంద్ర మోడీ కార్పొరేట్ల జపం చేస్తూ వారి కోసమే పాలన సాగిస్తున్నారని సిపిఎం సీనియర్ నాయకుడు జి.ఓబులు విమర్శించారు. 1926 బ్రిటీషు కాలంలో పోరాడి సాధించుకున్న సమ్మె హక్కు చట్టాన్ని లేబర్ కోడ్ల పేరుతో అత్యంత నిరంకుశంగా రద్దు చేసిందన్నారు. సంఘం పెట్టుకోవడం, యజమానితో బేరసారాలు ఆడటం, ఆఖరికి సమ్మెకు సిద్ధం కావటం అన్నింటినీ కాలరాస్తోందన్నారు. ఇలాంటి వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

పాలనలో మనువాద బావజాలం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

మత విధానాలతో మోడీ ప్రభుత్వం భారతదేశం అన్న భావననే విషపూరితం చేసి, ప్రజల్లో హిందుత్వాను జొప్పిస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప విమర్శించారు. దళితులు, గిరిజనులు మనువాద భావజాలం కింద నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మతోన్మాద బిజెపి దుష్టపాలనను తిప్పికొట్టడమే 50 యేళ్ల ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటం మనకిచ్చే స్ఫూర్తి అన్నారు. పేదల సమస్యలు తీరెంత వరకు ఐక్య ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.సావిత్రి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, నగర కార్యదర్శి రామిరెడ్డి, కమిటీ సభ్యులు వై.వెంకట నారాయణ, ప్రకాష్ రెడ్డి, గోపాల్, ఇర్ఫాన్, వలీ నగర కమిటీ సభ్యులు ఎన్టీఆర్ శీన, లక్ష్మీనారాయణ, లక్ష్మీ నరసమ్మ, రామాంజనమ్మ, రాజు, బాలకష్ణ, జీవ, ఏటీఎం నాగరాజు, తిరుమలేశు, వరలక్ష్మి, అజాం, ఆది, రామంజి పాల్గొన్నారు.

మోసపుచ్చలేదు.. మేమే మోసపోయాం..!

- చట్టప్రకారం అంతా చెల్లించాం
- బాబు ఇ-స్టాంపులు టాంపర్ చేశారు..
- ఎస్ఆర్సి ఎమ్డి అమిలినేని యశ్వంత్

విలేకరులతో మాట్లాడుతున్న అమిలినేని యశ్వంత్

ప్రజాశక్తి-అనంతపురం

'ఈ స్టాంప్ల వ్యవహారంలో తాము ఎవరినీ మోసపుచ్చలేదు... తామే మోసోయి ప్రథమ బాధితులుగా ఉన్నాం.' అంటూ ఎస్ఆర్సి మేనేజింగ్ డైరెక్టర్ అమిలినేని యశ్వంత్ తెలిపారు. అనంతపురం నగరంలోని ఒక హోటల్లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంస్థ చార్టెడ్ అకౌంటెంట్ బాలాజీ, జనరల్ మేనేజర్ సతీష్తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బాలాజీ ఇ-స్టాంపులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఎస్ఆర్సి సంస్థ పెద్దఎత్తున పనులు చేపడుతున్న నేపథ్యంలో అనేక ప్రాంతాల్లో ఇ-స్టాంపులను నిరంతరాయంగా కొనుగోలు చేస్తుందన్నారు. ఈ క్రమంలో కళ్యాణదుర్గంలోనూ 463 ఇ-స్టాంపులను యర్రప్ప భార్య వెండర్గా ఉన్న కట్టా భార్గవి నుంచి కొనుగోలు చేసినట్టు వివరించారు. వీటి విలువ రూ.23 లక్షలని చెప్పారు. ఇందులో చాలా సరిగానే చెల్లించారన్నారు. 19 ఇ-స్టాంపులను ట్యాంపరింగ్ చేసి తాము కట్టిన మొత్తం కంటే తక్కువ కట్టి మార్ఫింగ్ చేసి తమకు అందజేయడం జరిగిందని వివరించారు. దీని విలువ రూ.22 లక్షలు ఉందని చెప్పారు. వీటి ఇటీవల తాము పరిశీలించిన సమయంలో విషయం బయటకు వచ్చిందన్నారు. దీనిపై తాము అనంతపురం నగరంలోని టుటౌన్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసామని తెలిపారు. మీడియాలో వస్తున్న విధంగా రూ.900 కోట్లు అన్నది బ్యాంకుల నుంచి తీసుకున్న రుణం కాదని అన్నారు. అది తమ సంస్థ హైపోథికేషన్ వాల్యు అని చెప్పారు. దీనికి 0.5 శాతం స్టాంపు డ్యూటీ ఉందని తెలిపారు. ఇది గరిష్ట పరిమితి రెండు లక్షల రూపాయలు మాత్రమేనని అన్నారు. ఆ రెండు లక్షల రూపాయలు తాము చెల్లించామని వివరించారు. బయట మాత్రం మొత్తం విలువపై లెక్కించి రూ.4.50 కోట్లుగా చూపిస్తున్నారన్నారు. ఇది సరైంది కాదని అన్నారు. దీనిపై వివరణివ్వడానికే మీడియా సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. మేనేజింగ్ డైరెక్టర్ యశ్వంత్ మాట్లాడుతూ తాము ఎవరినీ మోసం చేయలేదని అన్నారు. చట్టబద్ధంగా తమ సంస్థ గడిచిన 20 ఏళ్లుగా నడుస్తోందన్నారు. సుమారు 20 వేల మంది తమ సంస్థలో పనిచేస్తున్నాని తెలిపారు. వెండర్ ఇ-స్టాంపులో చేసిన మోసం ద్వారా మోసపోయామని గ్రహించి తామే ఫిర్యాదు చేసామన్నారు. తాము ప్రథమ బాధితులుగా ఉన్నామని పేర్కొన్నారు. దీన్ని కొంత మంది వక్రీకరించి లేనిపోని ఆరోపణలు చేసి తమ సంస్థ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా ప్రయత్నిస్తున్నారన్నారు. అటువంటి వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న చైర్మన్

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-హిందూపురం

ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన ఆర్థికసాయాన్ని నాయకులు బాధితులకు బుధవారం పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, హిందూపురం రూరల్ మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు హెచ్ఎన్ రాము ఆధ్వర్యంలో బాధితులకు ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. 21 మంది బాధితులకు రూ.15 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నేడు 'మన ఇంటికి మన ఎమ్మెల్యే'

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణం 20 వార్డు శివాలయం వీధిలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మన ఇంటికి మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు, ఈసందర్భంగా వార్డుల్లో నెలకొన్న సమస్యలను అధికారులతో మాట్లాడే అక్కడికక్కడే పరిష్కరిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణ

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణ డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నందు మోకాళ్లపై నిలుచుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 36 ప్రకారం కనీస వేతనం ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. అదే విధ:గా హెల్త్ అలవెన్స్, రిస్క్ అలవెన్స్ అమలు చేయాలని, ఆప్కాస్ కార్మికులందరినీ పర్మనెంట్ చేయాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు అధికారుల, పాలకుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్నారు. తక్కువ వేతనాలతో పనిచేస్తున్న కార్మిక కుటుంబాలకు తల్లికి వందనం, రేషన్ కార్డు, పింఛను, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వర్తించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జులై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో కార్మిక వర్గాలు, స్కీం వర్కర్లు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నరసింహులు, మున్సిపల్ కార్మిక యూనియన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఒప్పంద కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు.కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె బాట పడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఇంజనీరింగ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, సిఐటియు మండల కార్యదర్శి పై పల్లి గంగాధర్, పారిశుధ్యకార్మికుల యూనియన్ నాయకులు రామయ్య, నరసింహులు, కేశవ, ఇంజనీరింగ్ యూనియన్ నాయకులు రమణ, రాందాసు, బెస్త గంగాధర్, గణేష్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు, నాయకులు

చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరం

ప్రజాశక్తి - కొత్తచెరువు

చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని. ఎస్పీ వి రత్న, తెలిపారు. కొత్త చెరువులోనే జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో దిశా చట్టాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు గురువుల పట్ల విద్యార్థులు విధేయత కలిగి ఉండాలన్నారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిరోధక దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చైతన్య ర్యాలీలతో పాటు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ విజయ్ కుమార్, సిఐలు బాలసుబ్రమణ్యం రెడ్డి, మారుతి శంకర్, సురేష్, గోపీనాథ్ రెడ్డి, ఎస్ఐ లింగన్న, కృష్ణమూర్తి, శక్తి టీం సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సొంత భవన నిర్మాణానికి యుటిఎఫ్ చేయూత

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పట్టణంలోని పారిశుధ్య కార్మికుల సొంత కార్యాలయ భవన నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ధర్మవరం జోన్ నాయకులు చేయూతను అందించారు. బుధవారం పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో పారిశుధ్యకార్మికుల నాయకులకు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయ చంద్రారెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, సిఐటియు నాయకులు రమణ, యుటిఎఫ్ జిల్లా నాయకులు రామకృష్ణ నాయక్ తదితరులు పది వేల రూపాయలను పారిశుధ్య కార్మికుల యూనియన్ నాయకులు బాబు, ముకుంద, ఓబులేసు, పుల్లన్న ,చెన్నకేశవులు, వెంకటరాముడు, రమేష్, శ్రీనివాసులుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఆంజనేయులు, లక్ష్మయ్య, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

సామర్థ్యం లేని విద్యాసంస్థల వాహనాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

సామర్థ్యం లేకుండా నడుపుతున్న విద్యాసంస్థల వాహనాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రాంతీయ రోడ్డు రవాణా అధికారులకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ అనేక విద్యాసంస్థల వాహనాలకు అద్దాలు గ్రిల్స్ ఏర్పాటు చేయకుండా నిర్వహిస్తుండటంతో విద్యార్థులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. అదే విధంగా 60 సంవత్సరాల పైబడిన వ్యక్తులకు బస్సు డ్రైవర్లు నియమించుకోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వయసు పై పడటంతో ఆయా వ్యక్తులు సక్రమంగా వాహనాలను అదుపు చేయలేని పరిస్థితి ఉంటుందన్నారు.. అలాగే విద్యాసంస్థల వాహనాల్లో సాధారణంగా 25 నుంచి 40 వరకు సిట్టింగ్ కెపాసిటీ ఉంటుందని, అయితే పలు యజమాన్యాలు 40 నుంచి 65 మంది దాకా విద్యార్థులను ఎక్కించుకుని విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పాఠశాలల బస్సులపై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కన్వీనర్ ఆఫ్రిద్, ఉమేష్, ఇస్మాయిల్, రజీక్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సచివాలయ ఉద్యోగుల నిరసన

ధర్మవరంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

లేపాక్షిలో వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

సచివాలయ ఉద్యోగులకు సర్వీస్ రూల్స్ కల్పించాలని, ఉద్యోగుల సమస్యలపై తక్షణమే కమిటీ వేయాలని సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీధర్, ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, ఇంజనీర్ విభాగం అసిస్టెంట్ నాయకులు రాజకుమార్, డిజిటల్ అసిస్టెంట్ నాయకులు తుకారాం మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులందరికీ ప్రమోషన్లుకల్పించాలని, 9 నెలల పెండింగ్ అరియర్స్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగోన్నతులు ఇచ్చిన తర్వాతనే బదిలీ ప్రక్రియ చేపట్టాలన్నారు. సచివాలయ శాఖకు చట్టబద్ధత కల్పించాలని, పెండింగ్ నేషనల్ ఇంక్రిమెంట్లు వెంటనే ఇవ్వాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో సాయి మనోహర్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండల పరిధిలోని వివిధ పంచాయతీలలో పనిచేసే సచివాలయ సిబ్బంది బదిలీలు పారదర్శకంగా చేపట్టాలని సచివాలయ ఉద్యోగులు కోరారు. ప్రమోషన్లు లేకుండా, సీనియారిటీ జాబితా విడుదల చేయకుండా, ఖాళీలు చూపకుండా, సచివాలయం ఉద్యోగుల బదిలీలను చేయడాన్ని నిరసిస్తూ లేపాక్షి మండల ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీనియర్ అసిస్టెంట్ కుళ్లాయప్పకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని గుడిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం బెంగళూరుకు చెందిన శాంతమ్మ జి ఎన్ వి రంగయ్య శెట్టి జ్ఞాపకార్థం వారి కుమారులు మురళి, సత్యనారాయణ కుటుంబ సభ్యులు పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ మురళి కుటుంబ సభ్యులు దాదాపు పదిహేను సంవత్సరాలుగా తమ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందజేస్తున్నారని అందులో భాగంగానే ఈ సంవత్సరం కూడా పాఠశాలలోని 80 మంది విద్యార్థులకు పుస్తకాలు అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దస్తగిరి, సర్పంచి గిరిజమ్మ నాగరాజు రావ్, ఆలయ అర్చకులు శ్రీనివాసరావు, తెలుగుదేశం నాయకులు కడపల్లి రమణప్ప, ఉపాధ్యాయులు చంద్ర, కృష్ణ నాయక్, రమేష్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ వర్కర్స్ ప్రాజెక్టు యూనియన్ ఏర్పాటు

ప్రజాశక్తి-పెనుకొండ

అంగన్వాడీ వర్కర్స్ ప్రాజెక్టు యూనియన్ నూతన అధ్యక్ష కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం పెనుకొండ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడి వర్కర్స్ యూనియన్ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలుగా జయమ్మ, కార్యదర్శిగా భావమ్మ, కోశాధికారి మహబూన్నీసాను ఎన్నుకున్నారు. వీరితో పాటుసునీత, అనిత మరో ఐదు మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సహకరించండి

ప్రజాశక్తి - కదిరి టౌన్

ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సహకరించాలని డిఎస్పి శివ నారాయణస్వామి ఆటో డ్రైవర్లు ,తోపుడుబండ్ల వ్యాపారస్తులకు సూచించారు. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్లో ఆటో డ్రైవర్లు, చిరు వ్యాపారులు, తోపుడు బండ్లు వారితో సమావేశం నిర్వహించారు. రోడ్డుపై ఆటోలు తోపుడు బండ్లు అడ్డంగా ఉంచడంతో తీవ్ర అంతరాయం కలుగుతోందని తద్వారా చాలామంది ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. రోడ్డుపై వ్యాపారం చేసుకునేవారు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా సజావుగా వ్యాపారాలు చేసుకోవాలని రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ ఆటోలు తోపుడుబండ్లు ఉంచి వ్యాపారాలు సాగిస్తున్నారని ఇకపై అలా వ్యాపారాలు సాగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రములో సిఐ నారాయణరెడ్డి, ఎస్ఐ బాబ్‌జాన్, సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

ప్రజాశక్తి - తాడిమర్రి

మండల పరిధిలోని చిల్ల కొండయ్య పల్లి గ్రామంలో బుధవారం రోజున సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మ, ఆదెమ్మ, లక్ష్మీకాంతమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మూడు సంవత్సరములు పూర్తయిన పిల్లలను అంగనవాడీకేంద్రానికి పంపాలని సూచించారు.

విష జ్వరాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-నంబులపూలకుంట

విష జ్వరాల పట్ల అప్రమత్తత అవసరమని స్థానిక వైద్యాధికారి బాలాజీ నాయక్ తెలిపారు. ఇంటి పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. వర్షాకాలంలో డెంగ్యూ,మలేరియా వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు శాంతమ్మ,మహేశ్వర్ రెడ్డి,సుజాత,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ప్రజాశక్తి - తలుపుల

మండలకేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న దళిత రమణకు వైసిపి నాయకులు, ఉపసర్పంచి డికె. బాబు ఆర్థికసాయం అందజేశారు. బాధితుడికి రూ. 5వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డిపి ఫయాజ్ అహ్మద్, బురిజిపల్లి శివారెడ్డి, బొజ్జ రమేష్, కోట మౌలా తదితరులు పాల్గొన్నారు.

28న అగ్రిగోల్డ్ బాధితులతో సదస్సు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

అగ్రిగోల్డ్ కస్టమర్లు, ఏజంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 28న స్థానిక రోడ్డు భవనాల అతిథిగృహం ఎదురుగా ఉన్న ఎన్జీవో హోంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు అసోషియేషన్ నియోజకవర్గ అధ్యక్షులు హాజీ అత్తార్ మహబూబ్ బాషా తెలిపారు. అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. తిరుపతి రావు, ఉపాధ్యక్షులు సిద్దేశ్వర, అనంతపురం జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు నారాయణప్ప హాజరై అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల గురించి, సమస్యల పరిష్కారం గురించి చర్చించనున్నట్లు వారు తెలిపారు. అగ్రిగోల్డ్ బాధితులు (కస్టమర్లు మరియు ఏజెంట్లు) అందరూ తమ తమ సమస్యల గురించి చర్చించుటకు అన్ని మండలాల నుండి అగ్రిగోల్డ్ ఏజెంట్లు, కస్టమర్లు హాజరుకావాలని కోరారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి -పరిగి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసిన బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను బుధవారం సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు కృప సత్యరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బదిలీ ఉపాధ్యాయులు గోపాల్, మారుతి, కొండయ్య, రామమోహన్, సతీష్‌ను సన్మానించారు. వారు చేసిన సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం

రిలే దీక్షలో మాట్లాడుతున్న ఫెడరేషన్ కార్యదర్శి జగదీష్

ప్రజాశక్తి-హిందూపురం

పారిశుధ్యకార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తాం అని ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యదర్శి జగదీష్ అన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమెండ్ చేస్తు చేపట్టిన దీక్షలు బుధవారానికి రెండో రోజుకు చేరాయి. దీక్షా ముందు శిబిరంలో కార్మికులు నిరసన తెలిపి దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతు కూటమి ప్రతి పక్షంలో ఉన్నా సమయంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు న్యాయం ఉద్యమిస్తే, ఆ సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి, జనసేన నాయకులు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సైతం దీక్షా శిబిరానికి వచ్చి మద్దతు ఇచ్చి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారని గుర్తు చేశారు. అయితే అధికారంలో వచ్చిన అనంతరం కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వంతో పాటు బాలయ్య సైతం మర్చి పోయారన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు మరింత తీవ్రస్థాయిలో చేయడానికి కార్మికులంతా సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కే మల్లికార్జున, కోశాధికార ఆనంద్, ఉపాధ్యక్షులు రామచంద్ర, శంకరా మూర్తితో పాటు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - బత్తలపల్లి

సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అరుణ్ కుమార్, ధర్మవరం మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరాంనాయక్ సూచించారు. బుధవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని మహాత్మా జ్యోతిభాపూలే గురుకుల బాలుర పాఠశాలలో దోమల నివారణ మందు స్ప్రేయింగ్ చేశారు. బత్తలపల్లి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మలేరియా వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా దోమల నివారణకు దోమల మందు హాస్టల్లోని విద్యార్థుల వసతి గదుల్లో స్ప్రేయింగ్ చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ నీరు నిల్వ ఉన్న చోటే డెంగీ జ్వరాలకు కారణమయ్యే దోమలు అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రతి శుక్రవారం ఇళ్లల్లో ట్యాంకులు, డ్రమ్ముల్లో నీళ్ల నిల్వ లేకుండా చేయడం. పరిసరాలను శుభ్రం చేసుకోవడం ద్వారా డెంగీను ఆరికట్టవచ్చని చెప్పారు. మురుగునీటి నిల్వ ఉన్న ప్రాంతాలలో వేస్ట్ ఆయిల్ పోయాలన్నారు. వేడిగా ఉన్న ఆహార పదార్థాలనే తీసుకోవాలన్నారు. శుద్ధి చేసి లేదా కాచి చల్లార్చిన నీటిన మాత్రమే తాగాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ రాజశేఖర్, సూపర్వైజర్ అశ్వర్థనారాయణ, హాస్టల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది. ఆరోగ్య కార్యకర్త మారుతి ప్రసాద్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

56 పోలింగ్ కేంద్రాల పెంపునకు చర్యలు

రాజకీయ పార్టీల సమావేశంలో తహశీల్దార్

సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ వెంకటేశు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజకవర్గంలో ఇప్పటికే 253 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అదనంగా మరో 56 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తహశీల్దార్ వెంకటేశు పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా సవరణ నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై నియోజక వర్గ ఎన్నికల సహాయ అధికారి, తహశీల్దార్ వెంకటేశు ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ పార్టీ నాయకులు అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతు హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాలలో 1300 పైగా ఉన్న ఓటర్ల పోలింగ్ కేంద్రాలను విభజించి కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరూ ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఓటరు నమోదుకు ఫారం-6, ఓటు తొలగింపునకు ఫారం -7, సవరణలకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. అదే విధంగా రాజకీయ నేతలకు సంబందించిన విద్యా సంస్థల్లో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఆటోనగర్ వాసుల కోసం ఆర్‌టిఒ, బాలికల గురుకుల పాఠశాలలో పోలింగ్ బూత్ లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటర్ ఆధార్ అనుసంధాలపై రాజకీయ పార్టీల నాయకులు అంగీకరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, మండల ఆర్ఐ అమరేంద్ర, రెవెన్యూ సిబ్బంది, ఎన్నికల సిబ్బందితో పాటు టిడిపి పట్టణ అధ్యక్షులు వెంకటేష్, రూరల్ అధ్యక్షులు రాము, కౌన్సిలర్ రాఘవేంద్ర, చంద్రమోహన్ యాదవ్, వైసిపి శివ శంకర్ తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పని సర్దుబాటులో ఉపాధ్యాయులను కేటాయించాలి

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

పని సర్దుబాటులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అవసరమున్న పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించాలని ఎస్ టి యు నాయకులు కోరారు. ఈ మేరకు వారు జిల్లా విద్యాశాఖ అధికారి కిష్టప్పకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గజ్జల హరి ప్రసాద్ రెడ్డి, కోనంకి చంద్రశేఖర్ మాట్లాడుతూ పాఠశాలల పునర్విభజన ప్రక్రియలో భాగంగా ఉపాధ్యాయుల సాధారణ బదిలీల అనంతరం జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలోని అధిక సంఖ్యలో ఏకోపాధ్యాయ పాఠశాలలు, పిల్లల సంఖ్య పెరిగిన పాఠశాలలు ఉన్న సందర్భంగా పని సర్దుబాటులో భాగంగా ఉపాధ్యాయులను కేటాయించాలని తెలిపారు. మున్సిపల్ పాఠశాలలలో ప్రమోషన్ల వల్ల చాలా పాఠశాలలు ఉపాధ్యాయుల కొరతను ఎదుర్కొంటున్నాయన్నారు. తక్షణం ఆ పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గోపాల్ నాయక్, బి .ఎన్. ప్రసాద్, సంపత్ కుమార్, రవిచంద్ర కొత్తచెరువు మండల అధ్యక్షుడు శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ రమేష్ కుమార్, బాలయ్య పిఏ వీరయ్య

ప్రజాశక్తి-హిందూపురం

ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులపై అధికారులు నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున అధికారులకు సూచించారు. బుధవారం మున్సిపల్ చైర్మన్ ఛాంబర్ లో మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులతో ప్రజా సమస్యల పరిష్కారంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా గత నెలలో జరిగిన వార్డు పర్యటనలో ప్రజల సమస్యల గురించి వచ్చిన ఫిర్యాదులు, పరిష్కారం వంటి వాటిపై చర్చించారు. ప్రజల నుండి వచ్చే వినతి పత్రాలపై నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి రికార్డులు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రాఘవేంద్ర, సతీష్ కుమార్, గిరీష్, ఆయూబ్, ఇర్షాద్ అహమ్మద్, టీడీపీ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, టీడీపీ నాయకులు కిరోసిన్ బాబు, సుమో సీనా, బుల్లెట్ జియా, డైమండ్ బాబా, వెంకటేష్, రాజు, అన్వర్, అంజి, నూరుల్లా, ప్రవీణ్, జహూర్, వలి, ఎమ్.ఈ. దస్తగిరి, ఎమ్. హెచ్.ఒ శోభన్ రెడ్డి, డిఈఈ వాణి, ఏఈ.లు జనార్ధన్, శంకర్, ధీరజ్, శానిటరీ ఇన్స్ పెక్టర్ లు శంకర్, నిజాముద్దీన్, ఎల్.ఎస్. తిప్పన్న, ఎలక్ట్రికల్ ఏ.ఈ. లక్ష్మీకాంత్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణపై రైతులకు అవగాహన



పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల పరిధిలోని పాముదుర్తి, వెంకటాపురం గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రామసుబ్బయ్య రైతులకు పంట సస్యరక్షణ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన పంటలైన వేరుశనగ,మొక్కజొన్న పంటల సాగులో రైతులు అవలంబించాల్సిన నూతన వ్యవసాయ విధానం, పద్ధతులు, పంటలను ఆశించే చీడపీడల నివారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యాంత్రీకరణ పథకాల విధి విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నటరాజ్, ఏఈవోతో పాటు రైతు సేవకేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండలం పరిధిలోని చోళసముద్రం, బిసలమనేపల్లిలో వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు, మం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పంటసాగు, విత్తనశుద్ధి, సస్య రక్షణ చర్యలు తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మాలక్క, ఏవో అమరేష్, రైతులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: మండల పరిధిలోని మాగే చెరువు, చల్లా పల్లి గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి విజయభారతి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వ్యవసాయ అధికారులు రైతులతో కలిసి పొలాలను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ వేరుశనగ వేసే రైతులు ఆఖరి దుక్కిలో తప్పనిసరిగా ఎకరాకు 200 కేజీల జిప్సం వేసుకోవాలని, పంటవిత్తిన 24 గంటల సమయంలోపు పిండాలి పిచికారి చేస్తే కలుపు నివారించవచ్చని సూచించారు. పట్టు పరిశ్రమ శాఖ టెక్నికల్ అధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ ట్రైప్ వన్ ట్రైప్, టు షెడ్లను ప్రభుత్వం సబ్సిడీతో మంజూరు చేస్తుందని అవసరం గల రైతులు ఉపయోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వెంకటరమణ చల్లాపల్లి రామకృష్ణ, ఏఈవో అలేఖ్య, ఎంపీఈవో ధనుంజయ రైతులు పాల్గొన్నారు.

నల్లమాడ : మండలంలోని వంకర కుంట, బసిరెడ్డిపల్లి లో వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్, విఎఎ సంధ్య ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు రైతులతో కలిసి వేరుశనగ పైరును పరిశీలించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రాచానుపల్లి వద్ద వ్యక్తి దారుణహత్య

వివాహేతర నేపథ్యమే కారణం
మృతుని భార్య, ప్రియుడు అరెస్టు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం రూరల్ మండలం రాచానుపల్లి వద్ద బుధవారం ఉదయం ఓ వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. అనంతపురం సమీపంలోని సదాశివ కాలనీలో నివసిస్తున్న కుమ్మర నరసాపురం సురేష్ బాబు(43) హత్యకు గురయ్యాడు. అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ నిందితులను పట్టుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు నిందితులను బుధవారం మధ్యాహ్నం అరెస్టు చేశారు. హత్యకు గల కారణాలను రూరల్ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ ఆంజనేయులు మీడియాకు వివరించారు. అక్రమ సంబంధం నేపథ్యంలో సురేష్ బాబు భార్య ప్రియుడుని ఉసిగొల్పి హత్య చేయించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి మృతుని భార్య కుమ్మర నరసాపురం అనిత, ఆమె ప్రియుడు బాబా ఫక్రుద్దీన్‌లను అరెస్టు చేశారు. అనిత, ఫక్రుద్దీన్‌ల మధ్య సంబంధానికి భర్త బాబు అడ్డుగా ఉన్నాడని భావించి ఎలాగైనా అతన్ని కడతేర్చాలంటూ ఇద్దరూ భావించారు. ఇందులో భాగంగా అనిత ప్రియున్ని హత్యకు ప్రేరేపించింది. ప్రతీరోజూ రాత్రి హోటల్ మూసేసి తన భర్త ద్విచక్రవాహనంపై ఇంటికొస్తారని ఆ సమయంలో అతన్ని హత్య చేయాలని సూచించింది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ద్విచక్రవాహనంలో ఇంటికి వస్తున్న సురేష్ బాబుపై ఫక్రుద్దీన్ దాడి చేశాడు. ముందుగా ఖాళీ సీసాను సురేష్‌బాబుపై విసిరాడు. ద్విచక్రవాహనం నుంచి కిందపడిన అతన్ని స్క్రూడ్రైవర్‌తో పొడిచి ఆతర్వాత బండరాయితో బాది చంపాడు. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. హత్యోదంతంపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు అన్ని కోణాల్లో విచారించి రాబడిని సమాచారం మేరకు ఘటన జరిగిన ఆరుగంటల్లోపు ఛేదించి నిందితులు ఇద్దరినీ అరెస్టు చేవారు. కేసును ఛేదించిన సిఐ శేఖర్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

హత్యకు గురైన సురేష్‌బాబు

సకాలంలో నిత్యావసర వస్తువులు అందజేయండి

ప్రజాశక్తి - గాండ్లపెంట

సకాలంలో నిత్యావసర సరుకులు లబ్ధిదారులకు అందజేయాలని తహశీల్దార్ బాబురావు ఆదేశించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ బాబురావు, సిఎస్‌డిటి వాణి మాట్లాడుతూచౌక్ ధాన్యపు డిపోల ద్వారా రేషన్ బియ్యం సక్రమంగా అందజేయాలన్నారు. 65 సంవత్సరాలు ఆ పైబడిన వృద్ధులకు, వికలాంగులకు 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఇంటి వద్ద వెళ్లి అందచేయాలని డీలర్లకు తెలిపారు ఒకటవ తేదీ నుంచి 15వ తేదీ వరకు సక్రమంగా రేషన్ అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జాఫర్, డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు శివ రంగ ప్రసాద్, బాబు, సి సంజీవరెడ్డి, చిన్నోడు, వెంకటరమణ నాయక్, శ్రీరామ నాయక్, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు

జగన్‌పై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

ప్రజాశక్తి మడకశిర

మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని వైసిపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వ్యక్తిగత బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎక్కడికి వెళ్లిన వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక ప్రజల మధ్యకు వెళ్లకుండా బుల్లెట్ ప్రూఫ్ వాహనం స్వాధీనం చేసుకోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏడాది పాలనలో వైఎస్ఆర్సిపి నాయకులపై అక్రమ కేసులు, బెదిరింపులు. దౌర్జన్యాలపై పెట్టిన దృష్టి పాలనపై పెట్టి ఉంటే బాగుండేదన్నారు. ఇప్పటికైనా కుట్రలు కుతంత్రాలు మానుకొని పాలనపై దష్టి పెట్టాలన్నారు.

చేనేత కార్మికుని కుటుంబానికి ఆర్థికచేయూత

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణంలోని మూడవ వార్డ్ శాంతినగర్‌లో గల చేనేత కార్మికుడు ఆంజనేయులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మృతుని కుటుంబానికి పలువురు ఆర్థికసాయం అందజేశారు. పట్టణానికి చెందిన శంకర్ బ్రదర్స్ 20 వేల రూపాయలు, చింతా కుమార్ 5వేల రూపాయలను బాధితులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

29న ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని స్పందన హాస్పిటల్ లో ఈనెల 29న ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు స్పందన హాస్పిటల్ అధినేతలు డాక్టర్ బషీర్, డాక్టర్ వై. సోనియా బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచిత సంతాన సాఫల్య, గర్భకోశ వ్యాధుల వైద్య శిబిరమును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా గర్భకోశ వ్యాధులు కలవారికి కూడా ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిదంగా ఊపిరితిత్తుల, ఛాతి జబ్బుల వైద్య శిబిరమును నిర్వహించడం జరుగుతుంధన్నారు, ఈ ఉచిత వైద్య శిబిరానికి ప్రఖ్యాత వైద్య నిపుణులు డాక్టర్ పూర్ణచంద్ర రోగులకు వైద్య చికిత్సలు అందజేస్తారన్నారు.

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం

ప్రజాశక్తి - తనకల్లు

మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో బుధవారం స్థానిక ప్రోహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత మాదకద్రవ్యాలు వాడకం వలన సమాజంలో కలుగుతున్న దుష్పరిణామాలు, వారికి వస్తున్న సమస్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోహిబిషన్, ఎక్సైజ్ సిఐ మారుతిరావు ఎస్ఐ జిలానీ బాషా, సిబ్బంది తిప్పేస్వామి, కళాశాల ప్రిన్సిపల్ చెన్నకేశవ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందూపురం : మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నడుంబిగిద్దామని వన్ టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ సుధా వరలక్ష్మి అధ్యక్షతన పట్టణంలోని బాల యేసు జూనియర్, డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా పైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ రాజగోపాల్ నాయుడు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐఎఫ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కొండప్ప, ప్రొటెక్షన్ ఆఫీసర్ నాగలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్వైజర్ అనిత, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి నాగలక్ష్మి, లక్ష్మీ ప్రసన్న అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐ

జగన్‌ను రాజకీయాల నుంచి బహిష్కరించాలి : జనసేన

ప్రజాశక్తి - కదిరి అర్బన్

రాష్ట్రంలో శాంతియుతంగా ఉన్న పరిసర ప్రాంతాలలో వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అరాచకాలను సృష్టిస్తూ హింసను ప్రేరేపిస్తున్నారని ఇలాంటి వ్యక్తిని రాజకీయాలనుంచి బహిష్కరించాలని జనసేన పార్టీ కదిరి నియోజకవర్గ ఇన్చార్జి భైరవ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. సత్తెనపల్లి పర్యటనలో ఇద్దరు తన పార్టీ వ్యక్తులు చనిపోతే వారి కుటుంబాన్ని పరామర్శించిన దాఖలాలు లేవంటే ఎంత దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారో అర్థమవుతోందన్నారు. జగన్మోహన్ రెడ్డి కి కేవలం రాజకీయాలు తప్ప ప్రజా సంక్షేమం పట్టదని విమర్శించారు.